సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం ౹ 25 ౹ మార్చి ౹ 2024



తేడా వస్తే 'రంగు పడుద్ది'!

హోలీ పండుగ అంటేనే రంగులలో మునిగి తేలుతూ ఆనందంగా గడుపుతారు. తగిన జాగ్రతలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది' అని హెచ్చరిస్తున్నారు నిపుణులు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
రాయచోటి :	6.30	5.02
రాజంపేట :	6.31	4.58
పీలేరు :	6.34	4.54
మదనపల్లె :	6.32	5.01

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 38 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

స్కౌట్‌తో క్రమశిక్షణ



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మడితాటి

మదనపల్లె సిటీ : స్కౌట్‌తో క్రమశిక్షణ అలవడుతుందని స్కౌట్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మదనపల్లెలోని జీఆర్‌టీ ఇంగ్లీష్ హైస్కూల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనియన్ లీడర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కౌట్ అండ్ గైడ్ ఏర్పాటు కోసం మొదట రూ.381 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. స్కౌట్స్, గౌడ్స్‌లు బేసిక్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని వివరించారు. ఈ స్కౌట్, గైడ్ సర్టిఫికెట్లు పొందిన వారికి జీవో నంబర్ 27 ప్రకారం విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీఎం ఎంఈవో నారాయణ, కొత్తకోట ఎంఈఓ రెడ్డిశేఖర్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర్,ఆంగ్ల ఉపాధ్యాయుడు మహమ్మద్‌ఖాన్, రీసోర్స్ కమిటీ సభ్యులు లక్ష్మీరెడ్డి,కట్ మాస్టర్లు సుబ్బారెడ్డి,లక్ష్మీపతి, విద్యాధర తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై అభివృద్ధి పనుల పరిశీలన



అతిథిగృహాలను పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఏపీఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదనరెడ్డి పరిశీలించారు. అటవీప్రాంగణంలోని పాత శిథిల భవనాలను రూ.30 లక్షలతో ఆధునీకీకరించి మూడు అతిథి గృహాలను సిద్ధం చేశారు. వీటిని పరిశీలించిన ఆయన పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యూజియం వెనుక బండను పరిశీలించి దానిపై టెంట్ హౌస్‌లను నిర్మించేందుకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట మదనపల్లె సబ్‌డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఉన్నారు.

ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేయాలి

సిద్దవటం: లంకమల అభయారణ్యం లోని ఎర్ర చందనం పరిరక్షణకు అటవీ శాఖ సిబ్బంది కృషి చేయాలని పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. సిద్దవటం రేంజిలోని లంకమల అభయారణ్యాన్ని, సిద్దవటం రేంజి కార్యాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిద్దవటం, రోళ్లబోడు, గొల్లపల్లి బీట్లలోని ఎర్రచందనం చెట్లు ఉండే ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం పరిరక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. రోళ్లబోడు, సాబ్బావి బేస్ క్యాంపులను పరిశీలించి సిబ్బందికి అవసరమైయ్యే అదనపు వాహనాలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూల్ రేంజి సీసీఎఫ్ రామకృష్ణ, సోషల్ ఫారెస్టు డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్, కడప సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, బీటు, సహాయ బీటు అధికారులు పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, దీపిక, హైమావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: క్షయవ్యాధి వ్యాప్తి, నివారణపై వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్సలు పొందడం ద్వారా వ్యాధినివారణ సులువు అవుతుందన్నారు. ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేస్తూ క్షయవ్యాధి వ్యాప్తి, నివారణ పద్ధతుల గురించి అందరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖలో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభకనపరచిన ఉద్యోగులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లు అందచేశారు. జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖాధికారిణి శైలజ, టీబీ యూనిట్ వైద్యాధికారి రియాజ్ పాల్గొన్నారు.



అన్నదాతకు భరోసా!

- నాడు విత్తనాల కోసం మండలకేంద్రాల్లో పడిగాపులు
- నేడు సొంత గ్రామాల్లోనే రైతులకు నేరుగా విత్తనకాయలు
- అన్ని సేవలు ఆర్బీకేల్లోనే
- జిల్లాలో 394 ఆర్బీకేల ద్వారా రైతులకు సేవలు



ఆర్బీకేల్లో రైతులకు సబ్సిడీ ఎరువులు పంపిణీ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

ఇది కదా.. అభివృద్ధి

గుర్రంకొండ: ఒకప్పుడు రైతన్నా, రైతు కష్టాలన్నా ఎవరకీ పట్టేదికాదు. రైతంటే కేవలం మనిషి కావాల్సిన ఆహారాన్ని, ధాన్యాన్ని పండించే ఓ యంత్రం. అలాంటి భావన నుంచి రైతే రాజు అన్న స్థాయికి రైతుల పరిస్థితి తీసుకొచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. దేశంలోని ఏరాష్ట్రంలోను లేని విధంగా రైతు భరోసాకేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు కావాల్సిన అన్ని సేవలు ఆర్బీకేల్లో అందుతున్నాయి.

నాడు ఏ సేవలైనా మండల కేంద్రాల్లోనే..

గతంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులుగానీ, సిబ్బంది సేవలుగానీ అందుబాటులో ఉండేవికావు. ఏ అవసరం వచ్చినా మండలకేంద్రంలో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సివచ్చేది. ఖరీఫ్‌సీజన్ ప్రారంభంలో వేరుశెనగ విత్తనకాయల కోసం రైతులు గతంలో యుద్ధమే చేసే పరిస్థితి ఉండేది. రోజుల తరబడి మండల కేంద్రాల్లో క్యూలో నిలబడాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో ప్రజాప్రతనిధులు సిఫార్సులు ఉంటేనే రైతులకు విత్తనకాయలు లభించేవి. గతంలో మండలానికి అంతా కలపి ముగ్గురు వ్యవసాయశాఖ సిబ్బంది ఉండేవారు. 194 గ్రామాల్లో రైతుల పరిస్థితిపై వారికి అవగాహన ఉండేదికాదు. సబ్సిడీ యంత్రాలు, సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, పంట నష్టపరిహారం రైతులకు అందని ద్రాక్షపండ్లలా ఉండేదీ. ఇక ఎరువులు ఎన్నడూ కూడా సబ్సిడీ పై గతంలో ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం బయట ప్రాంతాల్లోని ఇతర వ్యవసాయ పంటల సాగు, పంట గిట్టుబాటు ధరలు వంటి అంశాలపై రైతులకు ఎలాంటి సమాచారం అందేది కాదు.



గతంలో వేరుశెనగ విత్తనకాయల కోసం మండలకేంద్రాల్లో క్యూలైన్లలో పడిగాపులు పడుతున్న రైతులు

నేడు ఆర్బీకేల్లోనే రైతులకు అన్ని సేవలు

నేడు సొంత గ్రామాల్లోనే అన్ని రకాల సేవలను ఆర్బీకేల ద్వారా రైతులు పొందుతున్నారు. ముఖ్యంగా రైతుభరోసా పథకం, పీఎం కిసాన్ వంటి పథకాల కోసం ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకొంటున్నారు. పంటల సాగుకు అవసరమైన సలహాలు సూచనలను స్థానిక గ్రామ వ్యవసాయశాఖ అధికారి ద్వారా పొందుతున్నారు. ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతులు ఇక్కడి నుంచి తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సీడీ ఎరువులు, విత్తనాలు కావాల్సిన కంపెనీల నుంచి పొందే అవకాశముంది. రాష్ట్రంలో తాము పండించే పంటలకు ఎక్కడెక్కడ, ఏయే మార్కెట్లో ఎంత మేరకు ధరలు ఉన్నాయో తెలుసుకొని తమ పంటలను విక్రయించుకోవచ్చు. ఆర్బీకేల ద్వారా నిరంతం సబ్సీడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయపనిముట్లతో పాటు ట్రాక్టర్లను కుడా సబ్సీడీపై రైతులకు ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేల్లో సబ్సీడీ ఎరువులు, విత్తనాలు, కొన్ని రకాల పురుగులమందులను నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు.

▶▶ విస్తృత సేవలు

దేశంలోనే ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో 10574 ఆర్బీకేలను 2019 సంవత్సరంలో ఏర్పాటుచేశారు. అందులో అన్నమయ్య జిల్లాలో 394 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 354 ఆర్బీకేలు నిర్మాణాలను పూర్తి చేసుకొన్నాయి. ఇందు కోసం ప్రభుత్వం రూ.98.50 కోట్లు ఖర్చు చేసింది. జిల్లా మొత్తం 457 మంది వ్యవసాయశాఖ అధికారులు మండల, గ్రామస్థాయిలో రైతులకు సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని 3.42 రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా విస్తృతసేవలు పొందుతున్నారు.

నేడు అందుబాటులో భూసార పరీక్షలు

నేడు ఆర్బీకేల ద్వారా రైతులకు భూసార పరిక్షలు చేసుకొనే సౌకర్యం ఉంది. ప్రతి ఏడాది రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసుకోవచ్చు. గతంలో భూసార పరిక్షలు గ్రామానికి ఒకరిద్దరు తప్ప మిగిలిన వారికి దిని గురించి తెలిసే అవకాశముండేది కాదు. ప్రస్తుతం ఆర్బీకే వ్యవస్థ వచ్చినప్పటి నుంచి రైతులకు భూసార పరీక్షలు అందుబాటులో వచ్చాయి. ప్రతి రైతు భుసార పరిక్ష చేయించుకొని అధిక పంటల దిగుబడి సాధించుకొంటున్నారు.

నేడు ఈ క్రాప్‌బుకింగ్, పరిహారం

నేడు ఆర్బీకేల ద్వారా ప్రతి తాము సాగుచేసిన పంటలకు సంబంధి ఈక్రాప్‌బుకింగ్ (పంట సాగునమోదు)తప్పనిసరిగా చేసుకొంటున్నాడు. తద్వారా విపత్తులు, తుఫాన్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వంనుంచి పంటనష్టపరిహారం పొందే అవకాశముంది. గతంలో అయితే పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందేదికాదు. ప్రభుత్వం నుంచి వచ్చే అరకొర పరిహారం కూడా మధ్య దళారులు, రాజకీయ నాయకుల పాలయ్యేది. అలాంటి పరిస్థితి నుంచి నేడు ఆర్బీకేల ద్వారా రైతులకే నేరుగా పంట నష్టపరిహారం అందుతుండడం విశేషం.



గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిలో ఏర్పాటుచేసిన రైతు భరోసాకేంద్రం

జిల్లాలో ఆర్బీకేల సంఖ్య:	394
నిర్మాణాలు పూర్తి చేసుకొన్నవి:	354
నిర్మాణాలకు మంజూరైన నిధులు:	రూ.98.50 కోట్లు
ఆర్బీకేల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్లు:	457
జిల్లాలో రైతుల సంఖ్య:	3.42 లక్షలు

నాలుగేళ్లుగా ఎలాంటి కష్టం లేదు



నాలుగేళ్లుగా మాకు వ్యవసాయ సేవలకు సంబంధించి ఎలాంటి కష్టం లేదు. జగనన్న మా గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని నాలుగేళ్లకిందట పెట్టించాడు. అప్పటి నుంచి మాకు ఏం కావాలన్నా అక్కడే దొరుకుతున్నాయి. సబ్సీడీపై ఎరువులు, విత్తనాలు, పనిముట్లు ఇస్తున్నారు. పంటలు నష్టపోతే పరిహారం ఇప్పిస్తున్నారు. – గోపాల్, రైతు, సుంకరవాండ్లపల్లె

విత్తన కాయల కోసం ఇబ్బంది పడేవాళ్లం



గతంలో వేరుశెనగ విత్తన కాయల కోసం నానా కష్టాలు పడేవాళ్లం. జూన్ నెల వచ్చిందంటే 30 కిలోమీటర్ల దూరంలోఉన్న మండలకేంద్రం గుర్రంకొండకు వెళ్లే వాళ్లం. అక్కడ రోజుల తరబడి విత్తనకాయల కోసం పడిగాపులు పడేవాళ్లం. నేడు ఆ పరిస్థితి లేదు. మా సొంత గ్రామంలోని ఆర్బీకేల్లోనే మాకు విత్తనకాయలతోపాటు అన్ని సౌకర్యాలు అందుబాటులోఉన్నాయి. – ఓబుళరెడ్డి, మెరంమీద పల్లె

33 అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్



కడప సెవెన్‌రోడ్స్: పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మే 13న పోలింగ్ జరగనుంది. విధి నిర్వహణ కారణంగా పోలింగ్ రోజు ఓటు వేసే అవకాశం లేదు. 33 అత్యవసర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. పోలింగ్ రోజు వార్తా సేకరణలో ఉండే విలేకరులకు కూడా ఈ సౌలభ్యం ఉంటుంది. అయితే ఎన్నికల సంఘం జారీ చేసిన ఆథరైజేషన్ లెటర్ ఉండాలి. పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం–12డిలను అందుబాటులో ఉంచారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం జిల్లాలో ప్రత్యేకించి ఒక నోడల్ అధికారిని నియమించారు.

అత్యవసర శాఖలు: మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీసు, అటవీశాఖ, సమాచార ప్రజా సంబంధాల శాఖ, పోలీసు, పౌర రక్షణ–హోం గార్డులు, ఆహార పౌరసరఫరాలు–వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్టుమెంట్ ఆఫ్ పీడబ్ల్యుడీ, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లు, విపత్తు నిర్వహణ.

పీడబ్ల్యుడీ ఓటర్లు 40 శాతం ఆపైబడి వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. వీరందరూ పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి అర్హులవుతారు.

పోస్టల్ బ్యాలెట్ పొందడం ఇలా..

పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం–12డిలు సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులో వ్యక్తిగత వివరాలు, ఓటరు గుర్తింపు సమాచారం, పోస్టల్ బ్యాలెట్ ఎందుకు కోరుతున్నారో చెప్పాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారు. సర్వీసు ఓటర్లకు రిటర్నింగ్ అధికారి రికార్డు ఆఫీసు ద్వారా నేరుగా పంపుతారు. భారత దేశం వెలుపల విధులు నిర్వర్తిస్తున్న సర్వీసు ఓటర్లకు విదేశాంగశాఖ ద్వారా పోస్టల్ బ్యాలెట్లు పంపుతారు. ఇక 85+ వారి ఇంటి వద్దకే ఇద్దరు పోలింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్, సెక్యూరిటీ వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. వీరు ఏ తేది, ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇస్తారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లతోపాటు డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్, ప్రీ పెయిడ్ రిటర్న్ ఎన్వలప్‌లను రిటర్నింగ్ అధికారి ఓటర్ల చిరునామాకు పంపుతారు. ఓటరు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి డిక్లరేషన్ ఫారం భర్తీ చేయాలి. బ్యాలెట్ పేపరు, డిక్లరేషన్ ఫారం, సీక్రసీ స్లీవ్‌లో ఉంచి దాన్ని ప్రీపెయిడ్ ఎన్వలప్‌లో ఉంచాలి. ఆ కవరుపై సరిపడు పోస్టల్ స్టాంప్ అంటించి సకాలంలో తిరిగి పంపాల్సి ఉంటుంది.

27న మేమంతా సిద్ధం



సభా వేదిక ఏర్పాటు చేస్తున్న దృశ్యం



సీఎం సభా వేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- సీఎం వైఎస్ జగన్ తొలి ఎన్నికల సభకు చకచకా ఏర్పాట్లు
- ప్రొద్దుటూరులో బహిరంగసభ

ప్రొద్దుటూరు: 2024 ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో రాష్ట్రమంతా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఇడుపులపాయ నుంచి ఇచ్చాపురం వరకు వైఎస్ జగన్ బస్సు యాత్ర చేయనున్నారు. ఈనెల 27న ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన అనంతరం యాత్రను ప్రారంభించనున్నారు. ఉదయం ఇడుపులపాయలో కార్యక్రమం ప్రారంభించిన తర్వాత వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా మధ్యాహ్న భజన సమయానికి ప్రొద్దుటూరుకు చేరుకోనున్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడిది చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీకన్యకాపరమేశ్వరి సర్కిల్, సినీ హబ్, ఆర్టీసీ బస్టాండ్, శివాలయం వీధి, రాజీవ్ సర్కిల్, కొర్రపాడు రోడ్డు మీదుగా బస్సు యాత్ర జరగనుంది. 5 గంటలకు పొట్టిపాడు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు. ఇందు కోసం సభ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజులుగా మైదానంలో కుర్చీలు, షామియానాలు, వేదిక ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సభ విజయవంతంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రొద్దుటూరులో ఈనెల 27న సాయంత్రం జరగనున్న మేమంతా సిద్ధం సభను నిర్వాహకులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రోగ్రాం కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప కార్పొరేషన్ మేయర్ సురేష్ బాబు వేదికను పరిశీలించారు. రూట్ మ్యాప్, జనసమీకరణ గురించి ఎమ్మెల్యేతో మాట్లాడారు. సభకు లక్ష మందికిపైగా హాజరవుతారని చర్చించారు. ఇడుపులపాయ, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల మీదుగా సీఎం జగన్ బస్సు యాత్ర వస్తుందని, సాయంత్రం 5 గంటల నుంచి సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీసీ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పిట్టా బాలాజీ, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నవ..యువ!



- అన్నమయ్య జిల్లాలో 18 ఏళ్లు నిండిన 34592 మంది కొత్త ఓటర్లు
- అధికంగా రాజంపేట, తక్కువగా పీలేరులో నమోదు
- ఓటు వజ్రాయుధం అంటున్న యువతీ, యువకులు

రాయచోటి: నేతల రాతలను మార్చడమే కాదు.. తమ బంగరు భవితను మార్చుకునేందుకు యువ ఓటర్లు ఎదురుచూస్తున్నారు. తొలిసారిగా ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. 2024 ఎన్నికల్లో అన్నమయ్య జిల్లాలో 34,592 మంది 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతంతో పోల్చితే వీరి సంఖ్య భారీగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఫలితమిచ్చిన ప్రచారం..

ఓటు హక్కు నమోదుపై కళాశాలలు, గ్రామాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయి. అర్హత కల్గిన యువతీ, యువకులు ఓటుహక్కును వినియోగించుకుని దేశ రాజకీయాలలో భాగస్వాములు కావాలని విస్తృత అవగాహన కార్యకమాలు నిర్వహించడంతో సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వీరి తీర్పు ఎటువైపు ఉండనుందనే ప్రశ్న పార్టీలను 'తొలి'చేస్తోంది.

యువతను ఆకర్షించేందుకు.....

జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున యూత్ థీమ్‌తో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 6 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా యువతతో నిర్వహించారు. ఇందులో రాజంపేటలో పురుషులు 3715, స్త్రీలు 3013 మొత్తం 6728, అలాగే కోడూరులో పురుషులు 2957, స్త్రీలు 2353 మొత్తం 5310, రాయచోటిలో పురుషులు 3333, స్త్రీలు 2617 మొత్తం 5950, తంబళ్లపల్లిలో పురుషులు 2888, స్త్రీలు 2370 మొత్తం 5258, పీలేరులో పురుషులు 2872, స్త్రీలు 2344, ఇతరులు ఇద్దరు మొత్తం 5218, మదనపల్లిలో పురుషులు 3255, స్త్రీలు 2873, మొత్తం 6128 మంది ఓటర్లు ఉన్నట్లు సమాచారం.

మంచి నేతను ఎన్నుకుంటాం....

ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి సంక్షేమంలో భాగస్వాములు అయ్యే నాయకులను ఎన్నుకుంటామని యువత స్పష్టం చేస్తున్నారు. కరువు ప్రాంతంగా ఉన్న జిల్లాలో సాగునీరు తాగునీటి వనరులను కల్పించడంతోపాటు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే మంచి నాయకుడిని గెలిపించుకుంటామంటున్నారు.

ఓటు విలువ తెలియపరుస్తాం



తొలిసారిగా ఓటుహక్కును వినియోగించుకుంటున్న మేము ఓటు విలువను అభివృద్ధి కోసం వినియోగిస్తాం. మాతో పాటు మా పరిసర ప్రాంతాల్లో ఉన్న మరో పదిమందికి ఓటు విలువను తెలియపరుస్తాం. -కె గురుసాయి చరణ్ , బిటెక్ ద్వితీయ సంవత్సరం, రాయచోటి

సంతోషంగా ఉంది



తొలిసారిగా ఓటుహక్కును కలిగి ఓటు వేసుకునే అవకాశం వస్తుండటంతో సంతోషంగా ఉంది. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే నాయకుడికి ఓటు వేస్తాను. విద్య, ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసేవారికి అందరూ అండగా నిలవాలి. -డి గౌతమి, బిటెక్ థర్డ్ ఇయర్, రాయచోటి

ఓటును అమ్ముకోం



ఓటు హక్కును ప్రలోభాలకు, ఇతర అవకాశాలకు అమ్ముకోం. విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశ్రామిక అభివద్ధి సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వాల ఎంపికకు, సమస్యలపట్ల అవగాహనతో బాధ్యతాయుతంగా పోరాడి నేతలను ఎన్నుకునేలా ఓటుహక్కును వినియోగిస్తాం. -సి కోయలత, బిటెక్ సెకండ్ ఇయర్, రాయచోటి

గెలుపును మలుపుతిప్పుతాం



ఓటుహక్కును సంపాదించుకున్న తరువాత తొలి ఓటుతో గెలుపును మలుపు తిప్పుతాం. డబ్బుకు ఓటును అమ్ముకోకుండా మరో నలుగురికి అవగాహన కలిప్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకు పాత్రుడయ్యే నిజమైన నాయకుడిని గెలిపించుకుంటాం. -ఎస్‌కె దినేష్ రెడ్డి, బిటెక్ (థర్డ్ ఇయర్), రాయచోటి

క్లుప్తంగా

యువ రైతు ఆత్మహత్య


మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల


శివశంకర్ (ఫైల్)

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల గ్రామానికి చెందిన వంగినేని శివశంకర్ (26) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు శివశంకర్ తన తండ్రి ఆంజనేయులుకు చెందిన ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి ఏడాది వ్యవసాయంలో నష్టం రావడంతో పాటు అప్పులు అధికమయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం పొలం వద్ద గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివశంకర్‌ను బంధువులు గుర్తించి వెంటనే తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. గాదెల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి మృతుడి తండ్రి ఆంజనేయులు, మామ మాజీ ఎంపీపీ రామ కృష్ణయ్యను పరామర్శించారు. వీరివెంట జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటి మడుగు సుధాకర్‌రాజు, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, కొమ్మూరు నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, మారె సుకుమార్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

దుంపలగట్టు ఆలయంలో చోరీ

ఖాజీపేట : దుంపలగట్టు అంకాళమ్మ ఆలయంలో దొంగలు హుండీలను చోరీ చేసి కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయ ధర్మకర్తలు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో అంకాళమ్మ ఆలయం ఒకటి. భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. అయితే ఈ ఆలయంలో ఉన్న మూడు హుండీలను శనివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ కూడా ఎత్తుకెళ్లారని అంటున్నారు. చోరీపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తేడా వస్తే 'రంగు పడుద్ది'!

హోలీ పండుగ అంటేనే రంగులలో మునిగి తేలడం. పిల్లలు, యువత, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఒక్క రంగు చల్లడంతో మొదలయ్యే హంగామా.. వింత వింత రంగులు పులుముకునే వరకు వెళుతుంది. ఆనందం హద్దులు దాటుతున్న కొద్దీ.. హోలీ తీరు కూడా మారిపోతుంటుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ముందస్తుగా తగిన జాగ్రతలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది' అని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

- నేడే హోలీ
- రంగులతో జరభద్రం



రాజంపేట టౌన్ : ఆనందాల రంగుల వేడుక హోలీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకునేందుకు ముఖ్యంగా యువత సిద్ధమవుతోంది. నేలపై హరివిల్లు విరిసినట్లు మనుషులు అనేక రంగుల్లో కనిపించే హోలీ అంటే యువత, చిన్నపిల్లల ఆనందానికి ఆకాశమే హద్దవుతుంది. అయితే హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు మనిషి శరీరంపై ప్రభావం చూపుతాయి. అంతేకాక ఈ రంగులు కళ్లల్లో పడితే కంటిచూపునకు పెద్ద ప్రమాదమే ఉంటుందని వైద్యులు అంటున్నారు. అందువల్ల హోలీ సందర్భంగా రంగులు చల్లుకునే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించకుంటే హోలీ ఆనందహేళి అవుతుంది. రసాయన రంగులతో కాకుండా సహజ సిద్ధమైన రంగులతో హోలీ ఆడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

రసాయనాలతో కూడిన రంగులతో చర్మవ్యాధి సమస్యలు

రసాయనాలతో తయారు చేసిన రంగులు మనిషిపై పడితే చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదముంది. ప్రధానంగా లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యురీ సల్ఫేట్ వంటివాటిని కలిపి తయారు చేసే రంగులు చాలా ప్రమాదాన్ని కలిగిస్తాయి. ఈ రంగులు కళ్లల్లో పడితే కంటి చూపుపోయే ప్రమాదం కూడా ఉంది.

- రసాయనాలతో కలిసిన రంగులతో హోలీ ఆడితే శరీరంపై రంగులు ఎక్కువ సమయం ఉంచకుండా చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి
- హోలీ సందర్భంగా ఎరుపు, పింక్ రంగులను వాడితే మంచిది. ఎందుకంటే ఈ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఆ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోవు
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనె రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి త్వరగా ఇంకవు.
- రంగులను శుభ్రం చేసుకోవడం కూడా సులువుగా ఉంటుంది.
- ముఖంపై పడ్డ రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కంటే క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.

చిన్నపిల్లలను రంగులకు దూరంగా ఉంచాలి



చాలా మంది సరదాకోసం హోలీ పండుగ సందర్భంగా చిన్నపిల్లలకు కూడా రంగులు రాస్తారు. అయితే చిన్నపిల్లల శరీరం లేతగా ఉండటం వల్ల రసాయనాలతో తయారు చేసిన రంగులు పిల్లల చర్మంపై వెంటనే ప్రభావం చూపుతాయి. ఇక కళ్లల్లో రంగులు పడితే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్ల పిల్లలను హోలీ సందర్భంగా రంగులకు దూరంగా ఉంచితే చాలా మంచిది.

డాక్టర్ వీరయ్య, చిన్నపిల్లల వైద్యులు, రాజంపేట

మద్యం మత్తులో ప్రమాదానికి, ప్రభుత్వానికి లంకె ఏమిటో..?


మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

మదనపల్లె : మోకాలికి, బోడిగుండుకి ముడిపెట్టడం అన్న సామెత అందరికీ తెలిసిందే. మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలు ఈ సామెతను మరో మారు గుర్తు చేస్తున్నాయి. ఏడాది క్రితం తెలుగుదేశం పార్టీలో చేరిన షాజహాన్‌బాషా(జహా)కు ఆ పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ ఇవ్వడంతో ఆయన సంతోషానికి అవధుల్లేకుండా పోతున్నాయి. అసందర్భ ప్రేలాపనలతో తన మిడిమిడి జ్ఞానాన్ని బయటపెట్టుకుంటున్నాడు. తాజాగా ఆదివారం అన్నమయ్య జిల్లా కురవంకలో జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నెలన్నర క్రితం కర్ణాటక సరిహద్దు చీకలబైలు బార్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన ఘటనను..రాష్ట్రప్రభుత్వం చేయించిన హత్యలుగా పేర్కొన్నారు. పట్టణంలోని యువకులు కొందరు పార్టీ చేసుకునే క్రమంలో ఇక్కడ మద్యం సేవించారని, అందులో నాణ్యత లేకపోవడంతో...కర్ణాటకకు వెళ్లారన్నారు. అక్కడ మద్యం తాగి వచ్చే సమయంలో ప్రమాదానికి గురై చనిపోయారని చెప్పారు. వాస్తవానికి జరిగిందేమిటంటే... కర్ణాటకకు వెళ్లి పీకలదాకా మద్యం తాగిన యువకులు డాబా వద్ద కారు రివర్స్ చేసేటప్పుడు మరో కారును ఢీకొని యజమానితో ఘర్షణకు దిగారు. అక్కడి నుంచి వాహనాన్ని వేగంగా నడుపుతూ.. చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద మరో కారును ఢీకొట్టారు. వారు ఎక్కడ తమను పట్టుకుంటే, పోలీస్ కేసు అవుతుందేమోనని భావించి, తప్పించుకునే క్రమంలో మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపారు. అదుపుచేయలేక బార్లపల్లె వద్ద రోడ్డుపై నిల్చున్న ఇద్దరు పేదరైతులను ఢీకొన్నారు. వారు అక్కడికక్కడే మరణించారు. అంతటితో ఆగక, స్థానికులు తమను వెంబడిస్తారన్న భయంతో ఎదురుగా వస్తున్న లారీని గమనించకుండా వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ప్రమాదంలో కారులోని ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి, రెండురోజుల తర్వాత చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. అతివేగం, మద్యం మత్తు, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాన్ని ప్రభుత్వ హత్యలుగా పేర్కొనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనంగా పలువురు అభివర్ణిస్తున్నారు. ఏదో విధంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేయాలన్న ఆలోచనతో.. ఆయన చేసిన అసందర్భ వ్యాఖ్యలపై నియోజకవర్గ ప్రజలు పెదవివిరుస్తున్నారు. టీడీపీలోని కొందరు నాయకులైతే...తమ అభ్యర్థి నోటి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు మున్ముందు ఇంకెన్ని వినాల్సి వస్తుందోనని తలలు పట్టుకుంటున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం


బాధితులను పరామర్శిస్తున్న సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి

ఓబులవారిపల్లె : యల్లాయపల్లె పంచాయతీలోని ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిగుడిసెలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన డి.పోలయ్య, ఎస్.వెంకటయ్యలకు చెందిన పూరిగుడిసెల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో మంటలు పెద్దఎత్తున చెలరేగడంతో గుడిసెలు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న యల్లాయపల్లె సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి వెంటనే ఎస్టీ కాలనీకి చేరుకొని బాధితులను పరామర్శించారు. బాధితులకు తక్షణ సహాయం కింద రూ. 20 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దఓరంపాడు ఎంపీటీసీ జరుగు చెంగమ్మ, కుంచం శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం కాగా, సంబంధిత పోలీ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పట్టణంలోని గాంధీపురానికి చెందిన వెంకటరమణ భార్య అనిత(32) గత ఏడాది జూలై 4న ఇంటి నుంచి వెళ్లి పోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలుచోట్ల ఆమె కోసం గాలించారు. కాలం గడుస్తున్నా ఆమె తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం ఆదివారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన ఓ మైనర్ యువతి కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్ కోసం మదనపల్లెకు శనివారం సాయంత్రం వచ్చింది. చిత్తూరు బస్టాండ్‌లో యువతి కనిపించకుండా పోవడంతో తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య బత్తల ఆదిలక్ష్మి(35) ఈనెల 22 మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎన్.శేఖర్ తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి



ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు ద్వారా కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెంది రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నూతన తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, అధునాతన టాయిలెట్‌లు, ఫ్యాన్లు, పుష్టికరమైన మధ్యాహ్నభోజనం తదితర అన్ని సౌకర్యాలను కల్పించారు. లక్షల రూపాయల ఫీజు కట్టే కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఏఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. అత్యాధునిక పద్ధతుల ద్వారా జ్ఞానాన్ని అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులు ప్రశంసనీయం.

- కోగటం ప్రకాశం, హెచ్‌ఎం ఎంపీయూపీ స్కూల్, ప్రకాష్‌నగర్, ప్రొద్దుటూరు

సొంతింటి కల సాకారం



దినసరి కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. 2021 నవంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు మా ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో మాకు రూ. 90 వేలు పరిహారం చెల్లించింది. ఆ డబ్బుతో గ్రామంలో తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకొని జీవిస్తున్నాము. తరువాత జగనన్న పాలనలో ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు వంతాటిపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు సొంత ఇంటి కల నెరవేరింది.

- కొండేటి లక్ష్మీదేవి, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

ఒక్కరోజులోనే ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో చేతికందేవి కావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామ వలంటీరుకు ధ్రువ పత్రాలు కావాలని చెప్పగానే ఒక్కరోజులోనే ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. ఇన్ని సేవలందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- ఎ. లత, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం

కొత్తమాధవరంలో..కదిలిస్తే.. కన్నీరే!

- సుబ్బారావు కుటుంబానికి కన్నీటి వీడ్కోలు
- ఒంటరిగా మిగిలిపోయిన అవ్వ, మనవరాలు
- మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఆకేపాటి


అంత్యక్రియల కోసం సిద్ధం చేసిన సుబ్బారావు, పద్మావతి, వినయ మృతదేహాలు

రాజంపేట/ఒంటిమిట్ట : చేనేతల నివాసం ప్రాంతం.. ఎప్పుడూ సందడిగా.. నేతల హడావుడితో ఉండే కొత్తమాధవరంలో ఇప్పుడు ఎవరిని కదిల్చినా కన్నీరే వస్తోంది. సుబ్బారావు కుటుంబంలో ముగ్గురు మృతి సంఘటన ప్రతి ఒక్కరిని బాధించేలా చేసింది. ఆదివారం పోస్టుమార్టం అనంతరం స్వగ్రామమైన కొత్తమాధవరం తీసుకొచ్చిన అనంతరం ఆదివారం చేనేతల కన్నీటి వీడ్కోలు మధ్య ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఒకరి వెంట ఒకరు..

ముగ్గురి మృతదేహాలను ఒకరివెంట ఒకరిని కాటికి తీసుకెళ్లే దృశ్యాలు ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టించాయి. ఈ కుటుంబం పరిస్థితి చూసిన ప్రతి ఒక్కరి హృదయాలు చలించిపోయాయి. సుబ్బారావు కుటుంబంలో చివరికి మృతుని తల్లి రామలక్షుమ్మ, పెద్దకుమార్తె నిత్యలక్ష్మీప్రసన్న మిగిలారు.

టీడీపీలో జరిగిన మోసం ఫలితమే ఈ విషాదం

ముగ్గురి చావులకు కారణం.. ప్రధానంగా టీడీపీలో జరిగిన మోసమేనని చేనేత వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆన్‌లైన్ ముందు ఒకరి పేరు, ఆపైన మరొకరి పేరు కలిగి ఉండటం వల్ల మృతుని ఆశలు నిరాశలుగా మారాయి. కొత్తపల్లె గ్రామానికి చెందిన కట్టా శ్రావణి పేరు ఆన్‌లైన్‌లో ఉంది. ఆమె విదేశాలలో ఉంది. 2015లో ఆన్‌లైన్‌లో ఉన్న పేరు 2017లో మారిపోయింది, ఇది టీడీపీ ప్రభుత్వంలో సాధ్యమైంది. అప్పటి తహసీల్దారు, వీఆర్‌ఓల తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మృతులకు నివాళులు అర్పించిన ఆకేపాటి

రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆదివారం కొత్తమాధవరంలో సుబ్బారావు, పద్మావతి, వినయ మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆకేపాటి వెంట రాష్ట్ర గృహనిర్మాణసంస్థ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ అనంతరామయ్య, నందలూరు వైఎస్సార్‌సీపీ కాపు నాయకుడు అరిగెమణి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 70 టీడీపీ కుటుంబాలు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలతో ఎమ్మెల్యే, తదితరులు


టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

చిట్వేలి : మండల పరిధిలోని పోల్లోపల్లి గ్రామానికి చెందిన 70 టీడీపీ కుటుంబాల వారు ఆదివారం చిట్వేలి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డిల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పోల్లోపల్లికి చెందిన కొండూరు గోవర్ధన్ రాజు, చెంగరాజు, మాధవరాజు, కొండూరు యానాదిరాజు, నరేష్, మనోజ్ రాజు, సుబ్బరాజు, ఈశ్వర్ రాజు, మధుసూదన్ రాజు, పందేటి కృష్ణంరాజు, నందిమండలం ప్రవీణ్ కుమార్, నారాయణ రాజు, బాలచంద్రరాజులతో సహా 70 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల ఉపాధ్యక్షుడు ధ్వజారెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మలిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ మహేష్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, దేవరాజు, విక్రమ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు రావాలంటే జగనే మళ్లీ రావాలి

వాల్మీకిపురం : పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలకడ మండలం నడిమిచెర్ల గ్రామం అడవిలో మాదిగపల్లె గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎస్.బొజ్జయ్య, రెడ్డెమ్మ, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మీ, సరస్వతి, సునీత, భూదేవి, నారాయణమ్మలతో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపుకోసం అందరం కలసి ముందుకు పోదామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే ఛైర్మన్ జయచంద్రారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, బాబురెడ్డి, భాస్కర్‌రెడ్డి, నల్లపరెడ్డి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

షార్టుసర్క్యూట్‌తో అరటితోట దగ్ధం

లింగాల : లింగాల మండలం రామట్లపల్లె గ్రామంలో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన ఇరికిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన 2ఎకరాల అరటి పంట దగ్ధమైంది. యాలకి అరటి పంట సాగు చేయడంతో అరటిచెట్లు భారీగా ఎత్తు పెరగడంతో అరటిచెట్లు విద్యుత్‌లైన్‌కు తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే పులివెందుల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అగ్నిప్రమాదం కారణంగా అరటి పంట, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయి రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది.

ఆర్టీసీ బస్సు కిందపడి యువకుడి మృతి


ఆర్టీసీ బస్సు కింద పడి మృతిచెందిన అభిరామ్

రైల్వేకోడూరు : పట్టణంలోని సిద్వేశ్వర సినిమా థియేటర్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సు కింద పడి అభిరామ్(23) అనే యువకుడు మృతి చెందాడు. ఆయన నుంచి తిరుపతివైపు బైక్‌లో అభిరామ్ వెళుతుండగా కోడూరు పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు వద్దకు రాగానే దర్మాపురానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు అభిరామ్‌ను ఆపి లిఫ్ట్ అడిగాడు. మోటార్ బైక్‌పై ఇద్దరు కలిసి వెళుతుండగా సిద్దేశ్వర సినిమా హాల్ వద్ద ముందువైపు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా తిరుపతి నుంచి కడపవైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కింద పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో అభిరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతుడు అభిరామ్ స్వగ్రామం నెల్లూరు జిల్లా రాపూరు మండలం మలలగుంట అని పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. రైల్వేకోడూరులో గత కొన్ని సంవత్సరాలుగా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ బాబు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి


నాగేశ్వరరెడ్డి (ఫైల్)


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట ఘాట్ ఎక్కుడు వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం బైకును వెనుకవైపు నుంచి ఢీ కొనడంతో కొలూరు నాగేశ్వరరెడ్డి(37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి బైకుపైన ఆదివారం ఉదయం రాయచోటి గ్రామానికి ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయలుదేరాడు. మంగంపేట వద్దకు చేరుకోగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో బైకుతో సహా రోడ్డు పక్కన ఉన్న కాలువలోని ముళ్లపొదల్లో పడిపోయాడు. ముఖానికి తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.